క్లుప్తంగా

అద్భుత ఘట్టం.. అగస్తేశ్వరుని సహస్ర ఘట్టాభిషేకం..



పట్నంబజారు: స్థానిక పాత గుంటూరులోని గంగాపార్వతీ సమేత అగస్తేశ్వరస్వామికి శ్రావణ మాసం సోమవారాన్ని పురస్కరించుకుని సహస్ర జల ఘట్టాభిషేకం నిర్వహించారు. ఉదయం నుంచే స్వామి వారికి గణపతి పూజ, రుద్రహోమం, అరుణ పారాయణ నిర్వహించారు. అగస్తేశ్వరునికి 121 సార్లు రుద్రపారాయణ చేశారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. సుగంధ పరిమళాలతో ఏర్పాటు చేసిన కుండలతో జల సహస్ర ఘట్టాభిషేకాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు సోమశేఖరశర్మ, లక్ష్మీనారాయణశర్మ, అర్చకులు చంద్రశేఖరశర్మ, ఏకా సాయిశర్మ, జశ్వంత్‌శర్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్వామి వారిని గజమాలలతో విశేషంగా అలకరించారు.

స్టేడియం ఎన్నికలకు ఓటర్ల జాబితా ప్రదర్శన

నెహ్రూనగర్: ఆగస్టు 18న నిర్వహించనున్న ఎన్టీఆర్ మున్సిపల్ క్రీడా ప్రాంగణం, స్విమ్మింగ్ పూల్ సొసైటీ పాలకవర్గ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాను సోమవారం ప్రదర్శించినట్లు నగర పాలక సంస్థ డెప్యూటీ కమిషనర్, ఎన్టీఆర్ స్టేడియం ఎక్స్ అఫీషియో జాయింట్ సెక్రటరీ, ఎన్టీఆర్ స్టేడియం పాలక వర్గ ఎన్నికల నిర్వహణ అధికారి డి.శ్రీనివాసరావు తెలిపారు. సొసైటీ ఎన్నికలలో పోటీ చేయాలన్నా, ఓటు వేయాలన్నా ఎన్టీఆర్ స్టేడియంలో శాశ్వత సభ్యత్వం కలిగి ఉండాలన్నారు. ప్రస్తుతం 2,126 మంది (శాశ్వత సభ్యత్వం కలిగిన) ఓటర్లు ఉన్నారని చెప్పారు. ఓటు తనిఖీ చేసుకొనుటకు వీలుగా బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో, రవీంద్ర నగర్‌లోని స్విమ్మింగ్ వద్ద, నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలంలో ఓటర్ల జాబితాలను ప్రదర్శించినట్లు వివరించారు.

ఆత్మహత్యలకు అశాస్త్రీయ విద్యా విధానాలే కారణం



లక్ష్మీపురం: విద్యార్థుల ఆత్మహత్యలకు అశాస్త్రీయ విద్యా విధానాలే కారణమని మేధావుల ఫోరం కన్వీనర్ పి.ఎస్.మూర్తి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆత్మహత్యలపై చర్చ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బండ చదువుల ఒత్తిడిలో అలిసిపోతున్న నవతరాన్ని కాపాడుకునేందుకు మార్గదర్శకాలను వెలువరించిన సుప్రీం తాజా చొరవ ప్రశంసనీయమైనదన్నారు. విద్యార్థుల్లో విపరీత నిర్ణయాలను నివారించాలంటే న్యాయ స్థానం సూచించినట్లు అన్ని విశ్వ విద్యాలయాల్లో నిపుణ కౌన్సిలర్లు, సైకాలజిస్టులను, నియమించాలన్నారు. విశ్లేషకులు న్యాయవాది అవధానుల హరి, సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి మాట్లాడారు. అనంతరం చర్చలో ఇంజినీర్ సదాశివం, అధ్యాపకులు సి.సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా గోదా అమ్మవారి పుష్పయాగం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ఆవరణలో సోమవారం గోదాదేవి అమ్మ వారి తిరునక్షత్రం సందర్భంగా అభిషేకం, శ్రీపుష్పయాగం వైభవంగా నిర్వహించారు. అమ్మ వారికి పంచామృతాభిషేకం, విశేష అలంకరణ, మహా మంగళహారతి, సాయంత్రం డాక్టర్ కోగంటి వేంకటశ్రీరంగ నాయకి బృందం పారాయణం చేపట్టారు. సుమారు ఏడు క్వింటాలతో ఐదు రకాలైన చామంతి, గులాబి, లిల్లీపూలు, మల్లే, సంపంగి, జాజి, తులసి, సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పాలకవర్గం, సూరెడ్డి రాంప్రసాద్, పద్మజ దంపతుల సంయుక్త ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చక స్వామి మాధవ స్వామి బృందం వైభవంగా శ్రీపుష్పయాగం నిర్వహించారు.

అనూష మృతిపై విచారణ చేయాలి

నెహ్రూ నగర్: నగరానికి చెందిన రజక మహిళ తొరటి అనూష మృతిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని రజక వృత్తి దోబీ ఘాట్ల పరిరక్షణ సమితి అధ్యక్షులు చెన్నూరు చెన్నయ్య విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో అనూష తల్లి సామ్రాజ్యంతో కలిసి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం చేశారు.

బహుళ ప్రయోజనాలతో ఫ్లైఓవర్ నిర్మించాలి

బెటర్ శంకర్ విలాస్ ఫ్లైఓవర్ జేఏసీ డిమాండ్



శంకర్‌విలాస్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న దుకాణ యజమానులు, జేఏసీ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: శంకర్‌విలాస్ ఆర్వోబీ ప్రాంతంలో భవిష్యత్ ప్రజా రవాణా అవసరాలకు అనుగుణంగా బహుళ ప్రయోజనాలు ఉండే విధంగా మెగా ఫ్లైఓవర్ నిర్మించాలని బెటర్ శంకర్ విలాస్ ఫ్లైఓవర్ జేఏసీ నాయకుడు వల్లూరి సదాశివరావు డిమాండ్ చేశారు. సోమవారం శంకర్ విలాస్ ఆర్వోబీ నిర్మాణ పనుల వద్ద మెగా ఫ్లైఓవర్ డిమాండ్‌తో ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా సదాశివరావు మాట్లాడుతూ ప్రభుత్వం నగర ప్రజల అభిప్రాయాలను గౌరవించకుండా, మెగా ఫ్లైఓవర్‌కు బదులుగా కేవలం 930 మీటర్ల పొడవుతో ఎర్త్‌వాల్ బ్రిడ్జి నిర్మించడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ప్రాజెక్టును డిజైన్ చేసిన కన్సెల్టెన్సీ ఇచ్చిన నివేదికను ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. అరండల్‌పేట–బ్రాడీపేట దుకాణ యజమానుల సంఘ అధ్యక్షుడు బెల్లంకొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణానికి ముందుగానే రైల్వేగేటు ఏర్పాటు చేసి, ప్రజా రవాణాకు అడ్డంకులు లేకుండా చేయాలని కన్సల్టెన్సీ ఇచ్చిన సూచనలు ఖాతరు చేయకుండా, నిర్మాణ పనులు చేపట్టారని విమర్శించారు. బ్రిడ్జి నిర్మాణానికి ముందే రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో స్థానిక అధికారులు 120 అడుగులతో కూడిన రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయడంతో పాటు విస్తరణకు అడ్డుగా ఉన్న విద్యుత్, టెలిఫోన్ స్తంభాలు, విద్యుత్ లైన్ల షిఫ్టింగ్ పనులు పూర్తి చేసి, భూ సేకరణ చట్ట ప్రకారం నష్టపరిహారాన్ని చెల్లింపులు జరపడం, భూ సేకరణ మేరకు భవనాలను తొలగించిన అనంతరమే పనులు ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మంజూరు ఆర్డర్‌లో స్పష్టంగా ఉన్నప్పటికీ ఇవేవీ అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలను పట్టించుకోకుండా చేస్తున్న పనులను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేసి రవాణాకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించిన తరువాతే పనులు ప్రారంభించాలని, అప్పటి వరకు పనులు నిలిపివేయాలని రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను ఖాతరు చేయకుండా బ్రిడ్జి నిర్మాణ పనులు కొనసాగించడం సమంజసం కాదన్నారు. ప్రజా స్వామ్యానికి తూట్లు పొడుస్తూ, చట్టాలను గౌరవించకుండా జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులు వ్యవహరించడం ప్రజలు గమనిస్తున్నారని, ఏకపక్ష విధానాలకు స్వస్తి పలకాలన్నారు. కార్యక్రమంలో కమల్ కాంత్, జి.వెంకట్రావు, ఏడుకొండలు, కార్తీక్, అవధానుల హరి, యుగంధర్, దుకాణ యజమానులు పాల్గొన్నారు.

జీటీఎస్ పనులు వేగవంతం చేయండి

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ కంపోస్ట్ యార్డులో గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్(జీటీఎస్) నిర్మాణ పనులను వేగవంతం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఏటుకూరు రోడ్‌లోని కంపోస్ట్ యార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఆగస్ట్ ఒకటి నుంచి ప్రతి ఇల్లు, కమర్షియల్ సంస్థల నుంచి ప్రజారోగ్య కార్మికులు తడిపొడిగానే వ్యర్థాల సేకరణ జరుగుతుందన్నారు. ఆగస్ట్ ఒకటి నుంచి నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉంటుందని చెప్పారు. నగరపాలక సంస్థ పరిధిలోని కాకానిరోడ్, పొన్నూరు రోడ్డులో రోడ్ల, డ్రెయిన్లపై ఆక్రమణలను మూడు రోజుల్లో స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, లేకుంటే పట్టణ పట్టణ ప్రణాళిక సిబ్బందే తొలగిస్తారని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నిర్దేశిత గడువులోగా అర్జీల పరిష్కారం



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

నెహ్రూనగర్: డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై అధికారులు నిర్దేశిత గడువులోగా పరిష్కారం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. సోమవారం నగర పాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాల్లో పీజీఆర్ఎస్ నిర్వహించారు. తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి 28 ఫిర్యాదులు తీసుకున్నారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుండి అర్జీలు తీసుకున్నారు. పీజీఆర్ఎస్ ద్వారా పట్టణ ప్రణాళిక విభాగానికి 18, ఇంజినీరింగ్ విభాగానికి 11, రెవెన్యూ విభాగానికి 6, ప్రజారోగ్య విభాగానికి 3, ఉపా సెల్ విభాగానికి 1, అకౌంట్స్ విభాగానికి 2 చొప్పున మొత్తం 41 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, ఎంఇహెచ్(ఇన్‌చార్జి)లు రామారావు, సోమశేఖర్, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

హెపటైటిస్‌పై అవగాహన ర్యాలీ



ప్రారంభిస్తున్న డాక్టర్ ఎన్.వి.సుందరాచారి, డాక్టర్ యశస్వి రమణ

గుంటూరు మెడికల్: అంతర్జాతీయ హెపటైటిస్ డే సందర్భంగా సోమవారం గుంటూరు జీజీహెచ్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యులు, వైద్య సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు ర్యాలీలో పాల్గొని హెపటైటిస్ నివారణ నినాదాలు చేశారు. గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ, గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్వీ సుందరాచారి ముఖ్య అతిథిగా విచ్చేసి ర్యాలీని ప్రారంభించారు. గుంటూరు జీజీహెచ్ నుంచి నాజ్ సెంటర్ మీదగా తిరిగి జీజీహెచ్ వరకు ర్యాలీ కొనసాగింది. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్వీ సుందరాచారి హెపటైటిస్ స్క్రీనింగ్ క్యాంప్‌ను ప్రారంభించారు. క్యాంప్ ద్వారా 500 మంది ఆరోగ్య సిబ్బందికి హెపటైటిస్ వ్యాక్సిన్ వేశారు. అనంతరం జరిగిన సభలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. జీజీహెచ్‌లో నేషనల్ వైరల్ హెపటైటిస్ ప్రోగ్రాం జరుగుతోందని, దీని ద్వారా 4 వేల మంది హెపటైటిస్ బీ వ్యాక్సిన్, 2500 మందికి హెపటైటిస్ సి వ్యాక్సిన్ ఉచితంగా వేశారన్నారు. జీజీహెచ్‌లో లభిస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్వయంగా ఎమ్మెల్యే హెపటైటిస్ బీ టీకా వేయించుకున్నారు. ప్రోగ్రామ్ నోడల్ ఆఫీసర్, గ్యాస్ట్రో ఎంట్రాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ షేక్ నాగూర్ బాషా మాట్లాడుతూ జీజీహెచ్‌లో ఇప్పటి వరకు 50వేల మందికి పైగా హెపటైటిస్ బీ స్క్రీనింగ్, 50 వేల మందికి పైగా హెపటైటిస్ సీ స్క్రీనింగ్ చేసి వ్యాక్సిన్లు, మందులు, అవసరమైన వారికి ఉచితంగా అందజేశామన్నారు. కార్యక్రమంలో హెపటైటిస్ కంట్రోల్ ప్రోగ్రాం నోడల్ ఆఫీసర్ డాక్టర్ నీలిమ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి డాక్టర్ అనుమల కవిత, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శివరామకృష్ణ, పీజీ వైద్యులు, నర్సింగ్ సూపరింటెండెంట్‌లు, అడ్మినిస్ట్రేటర్ బి.ప్రవీణ్, పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొరిటెపాడు: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా మంగళవారం సరఫరా నిలిపివేయనున్నట్లు గుంటూరు–2 డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.గురవయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు అంతరాయం ఉంటుందని చెప్పారు. కోబాల్ట్‌పేట, పట్టాభిపురం పోలీసు స్టేషన్ తదితర ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు. అదే విధంగా 11 కేవీ లైన్ నిర్వహణ నిమిత్తం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు రాజేంద్రనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో ఉండదని చెప్పారు.

రజక కమ్యూనిటీ హాలు నిర్మాణానికి స్థలం కేటాయించాలి

నెహ్రూనగర్: నగరంలో రజక కమ్యూనిటీ హాలు నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తి దారుల సంఘం ఉపాధ్యక్షుడు వల్లభాపురం వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సీబీఆర్ఎస్‌లో నగర కమిషనర్ పులి శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రజకుల వివాహాది, ఇతర శుభ కార్యాలయాలకు, సామాజిక సంక్షేమ సమావేశ నిర్వహణ కోసం స్థలం కేటాయిస్తూ కౌన్సిల్‌లో తీర్మానం చేయాలని కోరారు.

యువకుడి ఆత్మహత్య

పట్నంబజారు: యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై కేసు నమోదైంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాలు.. పాతగుంటూరులోని కొసరాజు వారివీధిలో నివాసం ఉండే నీలం జయరాజ్(25) ఇంటర్ చదివి, కమీషన్ దుకాణంలో పనిచేస్తున్నాడు. యూకేలో ఉద్యోగం కోసం ఒక కన్సల్టెంట్ ఆఫీస్‌కు గతంలో రూ.4 లక్షలు చెల్లించాడు. సదరు కన్సల్టెంట్ నిర్వాహకుడు మృతి చెందడంతో ఆ డబ్బులు తిరిగి రాలేదు. తిరిగి మరో కన్సెల్టెన్సీ నిర్వాహకులకు డబ్బులు చెల్లించాడు. ఈక్రమంలో జయరాజ్ మనస్తాపానికి గురై ఇంట్లో ఫ్యానుకు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సదరు కన్సల్టెంట్ నిర్వాహకులు మోసం చేశారా, ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పట్నంబజారు: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసుల తెలిపిన వివరాలు.. వైజాగ్‌కు చెందిన ఉండవల్లి గౌరీశంకర్ 15 ఏళ్లుగా గుంటూరులో ఉంటూ క్యాటరింగ్, ఇతర పనులు చేసుకుంటూ లాడ్జిలో ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈక్రమంలో ఈనెల 23న లిబర్టీ థియేటర్ సమీపంలోని మనోహర్‌లాడ్జిలో బ్లేడుతో తన గొంతు కోసుకున్నాడు. ఘటనను గమనించిన లాడ్జి నిర్వాహకులు బాధితుడిని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

• చీకటి దారి..



మూడు వంతెనలు కింద చీకట్లోనే రాకపోకలు

నగరంపాలెం: నగరంలోని రైల్వే అండర్ ఓవర్ బ్రిడ్జి కింద అంధకారంతో అలుముకుంది. ఇటీవల డొంకరోడ్డు మూడు వంతెనల వద్ద ఫ్లైఓవర్‌అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేశారు. రాకపోకలు సాగుతున్నాయి. దాదాపు మూడు బ్రిడ్జిల కింద అటు, ఇటు వైపు వెళ్లేందుకు నగర వాసులు ఆసక్తి చూపుతున్నారు. అయితే బ్రిడ్జికి రెండు వైపులా విద్యుత్ సౌకర్యాన్ని కల్పించలేదు. చోదకులు వాహనాల లైట్లతో ముందుకు వెళ్తున్నారు. నడిచి వెళ్లే పాదచారులైతే చీకట్లోనే రాకపోకలు చేస్తున్నారు. కంకరగుంట రైల్వే ఓవర్ అండర్ బ్రిడ్జి కింద రెండు వైపులా మొదటి నుంచి చివరి వరకు ఎల్ఈడీ దీపాలు, వైర్లతో కూడిన లైట్లను ఏర్పాటు చేశారు. అయితే మూడువంతెనల వద్ద అందుకు భిన్నంగా

మెదడు, నరాల వ్యాధులపై అవగాహన



మాట్లాడుతున్న వైద్యులు వివేక్ లంకా, సూరప్రదీప్‌కుమార్‌రెడ్డి

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర్వస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై కిమ్స్ శిఖర హాస్పిటల్స్, గుంటూరు జిల్లా సీనియర్ సిటిజన్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ సంయుక్తంగా సోమవారం మెదడు, నరాల సంబంధిత వ్యాధులపై సదస్సు నిర్వహించారు. ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు లంకా విజయబాబు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. వైద్యులు వివేక్ లంకా, సూరప్రదీప్‌కుమార్‌రెడ్డి పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌తో మెదడు, నరాలకు సంబంధించి వ్యాధులపై అవగాహన కల్పించారు. నరాల సంబంధింత వ్యాధులు అనేక రకాలని, పుట్టుకతో వచ్చేవి, జన్యుపరమైనవి లేదా జీవిత కాలంలో వచ్చేవి ఉంటాయని అన్నారు. మెదడు ఆరోగ్యాన్ని కాపాడుకోవడం, నివారణ చర్యలు తీసుకుని, సరైన చికిత్స పొందాలన్నారు. సంస్థ అధ్యక్షులు మన్నే సుబ్బారావు, కె. బసవనందికేశ్వరరావు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులను కంటికి రెప్పలా కాపాడండి

ఏఐపీఆర్పీఏ రాష్ట్ర కార్యదర్శి నిమ్మగడ్డ



డాక్టర్ విద్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాగేశ్వరరావు

గుంటూరు మెడికల్: విశ్రాంత ఉద్యోగుల ఆరోగ్య సమస్యల పరిష్కారానికి అండగా ఉండి, వారిని కంటికి రెప్పలా కాపాడాలని ఆలిండియా పోస్టల్, ఆర్ఎంఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిమ్మగడ్డ నాగేశ్వరరావు కోరారు. సోమవారం సీజీహెచ్ఎస్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విద్యకు విన్నవించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పెన్షనర్లకు సేవ, అంకితభావం అందించాలని కోరారు. ప్రతి విశ్రాంత ఉద్యోగి వైద్య చరిత్రను పరిశీలించి, వారి ఆరోగ్యంపై పూర్తి అవగాహన ఉంచాలన్నారు. డాక్టర్ వి.విద్య మాట్లాడుతూ వైద్యునిగా పెన్షనర్లకు సానుభూతి, మద్దతు అందిస్తానన్నారు. ఆరోగ్యపరంగా వారి బాగోగులు చూడటం డాక్టరుగా తన కర్తవ్యమన్నారు. రోగుల విశ్వాసాన్ని వమ్ము చేయనన్నారు. తొలుత నూతన బాధ్యతలు చేపట్టిన డాక్టర్ విద్యకు నిమ్మగడ్డ నాగేశ్వరరావు అసోసియేషన్ తరపున పుష్పగుచ్ఛం అందించారు. డాక్టర్ విద్యను కలిసిన వారిలో సంఘం ఉపాధ్యక్షులు సి.హెచ్.కోటేశ్వరరావు, సి.హెచ్.విద్యాసాగర్ ఉన్నారు.

పర్యావరణ హితమే మానవ హితం



విద్యార్థులతో అధ్యాపకులు

గుంటూరు ఎడ్యుకేషన్: పర్యావరణ హితమే మానవ హితమని ఏపీ జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) అధికారి ఆచార్య మద్దినేని సుధాకర్ పేర్కొన్నారు. సోమవారం పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయ అంతర కళాశాలల పరిధిలోని విద్యార్థులకు వ్యాసరచన, పోస్టర్ ప్రెజెంటేషన్ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సుధాకర్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో కనుమరుగవుతున్న ప్రకృతి గురుంచి ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఆలోచించాలని కోరారు. కన్నతల్లి వంటి ప్రకృతి పరిరక్షణ మనందరి బాధ్యత అని అన్నారు. ఏఎన్‌యూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య వి.దివ్య తేజోమూర్తి మాట్లాడుతూ ప్రపంచ మానవాళి, సమస్త జీవరాసుల ఆరోగ్యకరమైన జీవన విధానానికి ముఖ్య కారణమైన ప్రకృతిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. ఈసందర్భంగా వ్యాసరచన పోటీల్లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన ఎ.స్వరాజ్యలక్ష్మి(టీజేపీఎస్ కళాశాల), ఆర్.బాలరాజు(చలపతి కళాశాల), ఎస్.భార్గవి(టీజేపీఎస్ కళాశాల), పోస్టర్ పెయింటింగ్ పోటీల్లో ఎస్కూ నజీనా(టీజేపీఎస్ కళాశాల), పి.ముస్కాన్(సిమ్స్ కళాశాల), ఎస్కే ఫిరడోస్ (నిర్మల ఫార్మసీ కళాశాల)కు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిగ్రీ, పీజీ కళాశాలల ప్రిన్సిపాల్స్ డాక్టర్ బీవీహెచ్ కామేశ్వరశాస్త్రి, డాక్టర్ ఎస్.అనితా దేవి, గుంటూరు జిల్లా ఎన్ఎస్ఎస్ నోడల్ అధికారి డాక్టర్ జేవీ సుధీర్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఎ.భానుమురళీధర్, ఇంటర్ క్యాంపస్ ఇన్‌చార్జి జి.సురేష్ కుమార్, వ్యాయామ అధ్యాపకులు పి.వాసుదేవరరావు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



విజేతలకు బహుమతి అందజేస్తున్న దృశ్యం

గుంటూరు ఎడ్యుకేషన్: మనిషి తన భౌతిక అవసరాల కోసం తరతరాలుగా సాగిస్తున్న ప్రకృతి విధ్వంస ఫలితమే భూకంపాలు, వరదలు, విపత్తులు సంభవిస్తున్నాయని గుంటూరు చలమయ్య– కర్పూరపు వెంకటనారాయణ డిగ్రీ కళాశాల కార్యదర్శి కర్పూరపు సూర్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం సంగడిగుంటలోని చలమయ్య కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రకృతి వనరుల విధ్వంసం కారణంగా సంభవిస్తున్న విపత్తులు, అధిక ఉష్ణోగ్రతలను నివారించేందుకు నడుం బిగించిన ప్రపంచ దేశాలు ప్రకృతి పరిరక్షణకై ఎన్నో ప్రణాళికలను రచిస్తూ, అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రకృతిలో మానవుడు తప్ప మిగతా జీవరాసులు ప్రకృతి చెప్పినట్లు ప్రవర్తిస్తున్నాయని, అందుకు భిన్నంగా నడిచే మానవుడు చేసే ప్రతికూల చర్యల వలన ఏ పాపం ఎరుగని మూగజీవాలు భారీ మూల్యం చెల్లిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి ఎ.శ్రీధర్ పాల్గొన్నారు.

పలు ప్రాంతాలలో విస్తృత తనిఖీలు



వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న వెస్ట్ డీఎస్పీ అరవింద్

లక్ష్మీపురం: గుంటూరు వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలో పట్టాభిపురం, నగరం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి వెస్ట్ డీఎస్పీ కె.అరవింద్ విస్తృత తనిఖీలు నిర్వహించారు. వాహనాలు తనిఖీ చేసి రికార్డులు లేని వారిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ కె.అరవింద్ మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సిందిగా సూచించారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, మద్యం తాగి వాహనాలు నడపడం, త్రిబుల్ డ్రైవింగ్ వంటివి చేస్తే చట్ట పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఇటీవల కాలంలో అతివేగంగా ద్విచక్రవాహనాలు నడిపే వారి కోసం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రధానంగా తల్లిదండ్రులు మైనర్‌లకు వాహనాలు ఇవ్వడం వలన అతివేగంగా ప్రయాణించి ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. మైనర్లు వాహనాలు నడిపినట్లు ఉంటే వాహనాలు సీజ్ చేసి కేసులు పెడతామని చెప్పారు. అనంతరం వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆయన వెంట సీఐలు నజీర్‌బేగ్, గంగా వెంకటేశ్వర్లు ఉన్నారు.

హెపటైటిస్ బీ నివారణకు అవగాహన కీలకం

డాక్టర్ నీరేస్ రావెల



గుంటూరు ఎడ్యుకేషన్: హెపటైటిస్ బీ వ్యాప్తిని నివారించడంలో అవగాహన అత్యంత కీలకమని ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్‌కు చెందిన ప్రముఖ వైద్య నిపుణుడు నీరేస్ రావెల అన్నారు. ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా సోమవారం అమరావతిరోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాల ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు.
డాక్టర్ వీరేస్ రావెల మాట్లాడుతూ హెపటైటిస్‌లో వివిధ రకాలతో పాటు, హెపటైటిస్ గురించి శాస్త్రీయ దృక్పథంతో వివరించారు. కాలేయ సంబంధిత తీవ్రమైన సమస్యలు ఉత్పన్నమయ్యేందుకు ఉన్న అవకాశాలు, తద్వారా వాటిల్లే పరిణామాలను తెలియజేశారు. హెపటైటిస్ బీ అనేది కేవలం ఆరోగ్య సమస్యగా కాకుండా ప్రజా ఆరోగ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడారు. కార్యక్రమంలో ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ వి.చక్రవర్తి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె.లలిత, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కళ్యాణి, సహాయాచార్యులు సీహెచ్ వైష్ణవి, షేక్ షబానా పర్వీన్, డి. వేదవతి, అనిత, బాజీబాబు, అభిలాష్, వెంకట కల్యాణ్, రాజేశ్వరి, ఉమాదేవి పాల్గొన్నారు.